ప్రజాశక్తి

గురువారం 31 జులై 2025 | 5 | శ్రీ సత్యసాయి

విలేకరులతో మాట్లాడుతున్న సిహెచ్.నరసింగరావు

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న పాలకులు

ప్రజలు, కార్మికుల పక్షాన పోరాటం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ పాలన సాగిస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు విమర్శించారు. పుట్టపర్తి షాదీమహల్‌లో సిఐటియు జిల్లాస్థాయి సదస్సును ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జివిఎల్.నరసింహులు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్‌తో కలిసి నరసింగరావు విలేకరులతో మాట్లాడారు. సహజ వనరులన్నింటినీ పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు దారాధత్తం చేస్తున్నాయన్నారు. కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి పాలన సాగిస్తున్నాయన్నారు. కనీస వేతనాల అమలు కావడం లేదన్నారు. అదనపు పనిగంటల భారాన్ని కార్మికులపై మోపుతున్నారని తెలిపారు. పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో ఇటీవల 6000 మంది కార్మికులను తొలగించారన్నారు. కార్మికులు పని చేస్తున్న పరిశ్రమలో ఉద్యోగ భద్రత లేదన్న దానికి ఇది నిదర్శనం అన్నారు. ప్రతి కార్మికునికి కేంద్ర ప్రభుత్వం రూ.5000 చెల్లిస్తుందని ఆ మొత్తాన్ని కియా యజమాన్యం తన ఖాతాలో వేసుకుంటోందని విమర్శించారు. రాయలసీమలో సౌర శక్తి, సోలార్ ఉత్పత్తిని కూటమి ప్రభుత్వం ఆదానీకి కట్టబెట్టిందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీ ప్రజలను దోచుకునేందుకు ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్‌మీటర్లు వస్తే విద్యుత్ భారాలు పెరగడంతో పాటు వ్యవసాయం, ఎస్సీలకు అందుతున్న ఉచిత విద్యుత్ రద్దు అవుతుందన్నారు. ఇలాంటి వాటికి వ్యతిరేకంగా కార్మికులు, ప్రజల పక్షాన సిఐటియు పోరాటం సాగిస్తుందన్నారు. త్వరలో సిఐటియు జాతీయ మహాసభలు జరుగుతాయని, అందులో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించి కార్మికుల హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, అంగన్వాడీలు, ఆయాలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



చాపకింద నీరులా మైక్రో ఫైనాన్స్

- విస్తరించిన రుణ సంస్థలు
- పేదలపై మైక్రో పడగ
- పట్టిపీడిస్తున్న వడ్డీ జలగలు
- కట్టకుంటే బెదిరింపులు
- వీధిన పడుతున్న కుటుంబాలు

మళ్లీ మైక్రో ఫైనాన్స్ పడగ విప్పుతోంది. ప్రజల ఆర్థిక అవసరాలు, ఇబ్బందులను ఆసరాగా చేసుకుని మైక్రో ఫైనాన్స్ సంస్థలు పేట్రేగిపోతున్నాయి. అధిక వడ్డీలకు రుణాలు ఇస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయి. పదేళ్ల క్రితం పేద కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసిన ఈ సంస్థలు మళ్లీ దందా మొదలు పెట్టాయి. పేద ప్రజల అవసరాలే ఆసరాగా అధిక వడ్డీలకు ఇచ్చి వారి నడ్డి విరుస్తున్నాయి. 'మీరు చచ్చినా సరే మా సొమ్మ చెల్లించాల్సిందే.' అని ఆ సంస్థల ప్రతినిధులు బెదింపులకు దిగుతున్నారు. వేధింపులను భరించలేక కొందరు ఆత్మహత్యాయత్నం కు పాల్పడుతున్నారు. రికవరీ ఏజెంట్లు ప్రతివారం ఇళ్ల వద్దకు వచ్చి రుణగ్రహీతలను వేధిస్తున్నారు.. సకాలంలో చెల్లించకపోతే అదనపు వసూళ్లకు పాల్పడుతూ, ఇళ్ల వద్ద పరువు తీస్తున్నారు. ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థల బారినపడి అనేక మంది రోడ్డున పడుతున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో వేలాది కుటుంబాలు అధిక వడ్డీ చెల్లించ లేక నలిగిపోతున్నాయి.

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండలోనే రూ.5నుంచి రూ.7కోట్ల రుణాలు

కియా కార్ల పరిశ్రమ రాకతో పెనుకొండ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ కియా అనుబంధ పరిశ్రమలు, గార్మెంట్ సంస్థలున్నాయి. వేలాది మంది మహిళలు గార్మెంట్స్ లో పనులకు వెళుంటారు. పేద, దిగువ మధ్యతరగతి జనాభా గణనీయంగా ఉన్న ఈ ప్రాంతంపై కర్నాటక, తమిళనాడుకు చెందిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు గురి పెట్టాయి. కొన్ని సంస్థలు ఇక్కడే కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని రుణాలు ఇస్తున్నాయి. ఒకపెనుకొండ పట్టణంలోనే రూ.5 నుంచి రూ.7 కోట్లు పైగా మైక్రో ఫైనాన్స్ సంస్థలు అప్పులు ఇచ్చాయి. వీటి ప్రతినిధులు ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో డబ్బువసూలు చేస్తూ బెదిరిస్తూ కనిపిస్తుంటారు.

పురుష సంఘాలు ఏర్పాటు చేసి అప్పులు

సాధారణంగా మహిళా సంఘాలకు అప్పులు ఇవ్వడం చూశాం. అయితే మైక్రో ఫైనాన్స్ సంస్థలు పురుషులతో సంఘాలను ఏర్పాటుచేసి అప్పులిస్తున్నాయి. గ్రామాల్లో డబ్బులు అవసరమున్నవారిని గుర్తించి ఐదుగురు పురుషులను ఒక సంఘంగా ఏర్పాటు చేస్తున్నాయి. సంఘానికి రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు అప్పులు ఇస్తాయి. సంస్థ ప్రతినిధులు అడ్వాన్స్‌గా రూ.లక్షకు రూ.10వేల చొప్పున తీసుకుని ఆపై వారంవారం సంఘం రూ.10వేలు చెల్లించేవిధంగా ఒప్పందం కుదుర్చుకుంటారు. ఈ విధంగా పది వారాల పాటు రికవరీ ఏజెంట్లు ఇళ్ల వద్దకు వచ్చి డబ్బులు వసూలు చేసుకుని వెళ్తారు. గ్రూపులో ఏ ఒక్కరు వాయిదా ఆలస్యం చేసిన మిగిలిన వారిని బాధ్యులను చేసి వారినుంచి సొమ్ము వసూలు చేస్తారు. ఒకవారం వాయిదా ఆలస్యమైతే చక్రవడ్డీతో వసూలు చేస్తారు. మహిళా సంఘాల గ్రూపులకు కూడా ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలు అప్పులు ఇస్తుండటం గమనార్హం.

పేదలే టార్గెట్

మైక్రో ఫైనాన్స్ సంస్థలు ప్రధానంగా పేదలను టార్గెట్ చేస్తున్నాయి. వారి నుంచి రేషన్ కార్డ్, ఓటరు ఐడీ, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను తీసుకుని రుణాలు ఇస్తున్నాయి. బ్యాంకుల్లో రుణాలు పొందాలంటే నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్, సిబిల్ స్కోర్, నెల వేతనం, ఐటీ రిటర్న్స్ ఇలా అనేక నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. లేదంటే బంగారం, ఆస్తులు వంటివి తనఖా పెట్టాలి. అయితే మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఎలాంటి పూచీకత్తు లేకుండా కేవలం ధ్రువపత్రాలను తీసుకొని రుణాలు ఇస్తున్నాయి. దీంతో పేదలు వాటిని ఆశ్రయించి అధిక వడ్డీలకు బలవుతున్నారు.

చిరు వ్యాపారులే లక్ష్యం

జిల్లాలోని మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీ కేంద్రాలలో టీ కొట్టు దుకాణాలు, కిరాణాకొట్లు, కూరగాయలు, చికెన్ సెంటర్ల నిర్వాహకులే లక్ష్యంగా ఈ సంస్థలు అధిక వడ్డీలకు రుణాలు ఇస్తాయి. వాటి ప్రతినిధులు రోజువారీ, లేక వారం వారం వాయిదాల పద్ధతిలో డబ్బులు వసూలు చేస్తారు. ఫైనాన్స్ సంస్థలు డబ్బు వసూలు కోసం నిరుద్యోగులైన యువకులను తక్కువ వేతనాలకే ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ యువకులు రికవరీ ఏజెంట్లుగా అప్పు తీసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వసూలు చేసుకుని సంస్థల్లో చెల్లిస్తుంటారు. అప్పులు చెల్లించడం ఏ మాత్రం ఆలస్యమైన ఈ రికవరీ ఏజెంట్లు చేసే అఘాయిత్యాలు అన్ని ఇన్నీకావు. అప్పు తీసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరువు తీస్తారు. కొంతమంది వీరి ఆగడాలు భరించలేక గ్రామం వదిలి వెళ్లిన సంఘటనలున్నాయి.

ఐదు కేంద్రాల్లో మైక్రోఫైనాన్స్ సంస్థలు

జిల్లాలోని పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, హిందూపురం కేంద్రాలుగా ఈ మైక్రోసంస్థలు కార్యకలాపాల కొనసాగిస్తున్నాయి. కొందరు ప్రయివేటు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి అనధికారికంగా ఫైనాన్స్ సంస్థలు నడుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా అధిక వడ్డీలకు అప్పులిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. అప్పులు తీసుకున్న వారితో ప్రాంసరీనోటు, చెక్కులు రాయించుకుంటారు. కొన్ని సందర్భాల్లో ఆస్తుల ఒరిజనల్ పత్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు. అప్పులు చెల్లించకపోతే వడ్డీలకు వడ్డీలు వేసి వారి ఆస్తులు తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు.

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం చిరు వ్యాపారులు, మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్థికంగా ఎదుగుదలకు చేయూతను అందించాలి. గతంలో మైక్రో ఫైనాన్స్ సంస్థలను రాష్ట్రంలో కట్టడి చేసిన విధంగా ప్రస్తుతం అదేవిధంగా చర్యలు చేపట్టాలి.

హరి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి విస్తత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి పనులు ఏమైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. పెట్టుబడి రాయితీ కింద రూ.120 లక్షలు, వడ్డీ రాయితీ కింద 4 యూనిట్లకు రూ.11.91 లక్షలు, విద్యుత్ రాయితీ కింద ఒక యూనిట్‌కు రూ.51,950 మంజూరుకు కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, జిల్లా ఫ్యాక్టరీల అధికారి రాధాకృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగడానికి చేయూతనివ్వండి

పి-4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు చేయూతను అందించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ జిల్లాలోని వివిధ భారీ పరిశ్రమల యజమానుల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్లో వివిధ భారీ పరిశ్రమల యజమానుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి-4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదల అవసరాన్ని బట్టి పరిశ్రమల యజమానులు ఆ కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయకుమార్, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఢిల్లీకి ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే బాలకృష్ణ రాజధాని ఢిల్లీ చేరుకున్నారు. గురువారం కేంద్ర జాతీయ రహదారుల, రవాణా శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీ తో కలవున్నారని హిందూపురానికి రింగ్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరన్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శులు తెలిపారు. ఇప్పటికే 716జి జాతీయ రహదారి ముద్దనూరు నుంచి పులివెందుల, కదిరి, గోరంట్ల హిందూపురం, కగ్గలు సమీపంలోని 554 ఈ జాతీయ రహదారికి కలపనున్నారన్నారు. అక్కడి నుంచి 28 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరిస్తూ పూలకుంట, కొటిపి, బేవినహళ్లి, సేవా మందిరం నుండి పరిగి మండలంలో 544వ జాతీయ రహదారికి కలిసే విధంగా రోడ్డు మంజూరు చేయాలని కోరనున్నట్లు చెప్పారు. అదే విధంగా కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ, యువజన వ్యవహారాల, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మండవీయా ను కలవనున్నారన్నారు. రాష్ట్రంలోనే పెద్ద పారిశ్రామిక వాడైనా తూముకుంట పారిశ్రామిక వాడలో కార్మికుల ఆరోగ్యం కోసం 30 పడకల ఆసుపత్రి నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరనున్నారని చెప్పారు.

'తోపుదుర్తి'కి మరో తలనొప్పి..!

రాక్రీట్‌పై విచారణ పూర్తయిందన్న మంత్రి

చర్యలు తప్పవా.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మరో తలనొప్పి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆయనపై పలురకాలైన కేసులు నమోదయిన విషయం తెలిసిందే. ఇక వైసిపి ప్రభుత్వ హయంలో నిర్మించిన గృహ నిర్మాణాలకు సంబంధించి కూడా కొత్తగా సమస్యలొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసిపి హయాంలో జగనన్న కాలనీల్లో నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే కాంట్రాక్టును రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో సుమారు 15వేల వరకు ఇళ్ల నిర్మాణాల కాంట్రాక్టును తీసుకున్న రాక్రీట్ సంస్థ సకాలంలో పనులు పూర్తి చేయలేదు. చాలా వరకు అసంపూర్తిగానే ఇళ్ల నిర్మాణాలున్నాయి. దీనిపై అనేక ఆరోపణలు కూడా వచ్చిన నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ విచారణకు ఆదేశించారు. ఇప్పటికే చాలా వరకు నివేదిక పూర్తయినట్టు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో తెలిపారు. విచారణలోనున్న అంశాలు ఇప్పుడే వెల్లడించలేమని అన్నారు. మొత్తంలో ఈ విచారణలో లోపాటను విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు శాఖ గుర్తించినట్టు సమాచారం. చాలా వరకు పనులు చేసిన దానికంటే ఎక్కువ బిల్లులు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో ఏ మేరకు బిల్లుల చెల్లింపులు జరిగాయన్నది విచారణ నివేదిక ఆధారంగా వెలుగులోకి వచ్చే అవకాశముంది.

రాక్రీట్‌లో ప్రకాష్‌రెడ్డి బంధవులు ?

రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ గృహ నిర్మాణ పనులను చేపట్టింది. ఇందులో అనంతపురం నగరానికి సంబంధించి కూడా ఆలమూరు వద్ద లేఅవుట్‌లో నిర్మాణాలు జరిగాయి. రాక్రీట్ సంస్థ నేరుగా తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి లేకపోయినప్పటికీ ఆయన సమీప బంధవులు కొందరున్నారు. తోపుదుర్తి అమర్‌నాథరెడ్డి, గడ్డం మదన్‌మోహన్‌రెడ్డి, గంట్ల సునీల్ దత్త కుమార్‌రెడ్డిలు డైరెక్టర్లుగానున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలోనే వీరు ఈ సంస్థలో డైరెక్టర్లుగా చేరారు. సాంకేతికంగా వీరు సంస్థలోనున్నప్పటికీ నిర్వహణలో ప్రకాష్‌రెడ్డి పాత్ర ఉన్నట్టు ప్రచారం నడుస్తోంది.

ఆయనపైనా చర్యలుండేనా ?

రాక్రీట్ సంస్థపై జరిగిన విచారణలో అవకతవకలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో ప్రకాష్‌రెడ్డిని కేసులు వెంటాడుతాయా లేక సంస్థలో భాగస్వామ్యులుగా ఉన్న వారితోనే సరిపెడతారా అన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా గృహ నిర్మాణాల్లో జరిగిన అవకతవకలు ప్రకాష్‌రెడ్డికి మరో తలనొప్పినే తెచ్చిపెట్టే పరిస్థితులే ఎక్కువగా కన్పిస్తున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

బాబు హామీలు గాలిమాటలే...

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-రాప్తాడు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ గాలి మూటలేనని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. రాప్తాడు వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ చెప్పిన హామీలు అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు నైజం అన్నారు. ఇక రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పరిటాల కుటుంబ సభ్యులు, వారి బంధువుల అక్రమాలు పేట్రేగాయన్నారు. తాను అక్రమ కేసులకు భయపడేది లేదని, చట్టపరంగా ముందుకెళ్తామని తెలియజేశారు. రాప్తాడులో రౌడీ రాజ్యాంగాన్ని అంతమొందించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి.

రసాభాసగా పెనుకొండ కౌన్సిల్‌మీట్

కౌన్సిలర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్మన్

ప్రజాశక్తి-పెనుకొండ

కౌన్సిలర్ల మధ్య వర్గ పోరుతో నగర పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. మాజీ మంత్రులు మాల గుండ్ల శంకరనారాయణ ఉషశ్రీ చరణ్ మధ్య గల విభేదాల కారణంగా పెనుకొండ నగర పంచాయతీ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఉషశ్రీ వర్గం ఎప్పుడెప్పుడు శంకర్ నారాయణ వర్గానికి చెందిన చైర్మన్ ఉమర్ ఫరూక్‌ను గద్దె దించాలా అని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పెనుకొండ నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి 20 మంది కౌన్సిలర్లు ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో 46 అజెండా అంశాలను ప్రవేశపెట్టారు. అంశాలపై చర్చ జరుగుతున్న సందర్భంలో నాలుగవ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ తయుబ్ ఒక్కసారిగా లేచి తాము సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నామని చెబుతూ కౌన్సిలర్లు అందరూ బయటికి రండి అని పిలిచారు. ఉన్నట్లుండి సమావేశ మధ్యలో అందరూ బయటికి రండి అంటే దిక్కు తెలియని మహిళా కౌన్సిలర్లు బయటకు వెళ్లారు. ఎందుకు బయటకు వెళుతున్నారని సమస్యలు ఉంటే చర్చించి పరిష్కరించుకునేందుకే సమావేశం నిర్వహిస్తున్నామని ఇలా అందరినీ భయపెట్టి బయటకు పిలుచుకుపోవడం సమంజసం కాదని చైర్మన్ ఉమర్ ఫరూక్ కౌన్సిలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వార్డులలో జరిగే పనులు తమకు సమాచారం ఇవ్వకుండా చేపడుతున్నారని కౌన్సిలర్ అని గౌరవం ఇవ్వడం లేదని నాలుగో వార్డ్ కౌన్సిలర్ మహమ్మద్ తయుబ్, సుధాకర్ రెడ్డి వైస్ చైర్మన్ నందిని రెడ్డి తదితరులు కమిషనర్ సతీష్ కుమార్‌ను నిలదీశారు. వారం ముందుగానే కౌన్సిలర్లు అందరికీ అజెండా అంశాలను పంపామని తమ దృష్టికి వచ్చిన సమస్యలను తెలిపితే అజెండాలో పొందుపరుస్తామని కమిషనర్ చెప్పారు. ప్రస్తుతం సమావేశం వాయిదా వేసి వచ్చే సమావేశంలో తీర్మాన అంశాలను ఆమోదింప చేసుకోవాలని వారు కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

రెండు వర్గాల పోరు...

మాజీ మంత్రులు శంకరనారాయణకు, ఉషశ్రీకి మద్దతు పలుకుతున్న కౌన్సిలర్లు రెండు గ్రూపులుగా విడిపోయారు. శంకరనారాయణ వర్గానికి చెందిన చైర్మన్ పలువురు కౌన్సిలర్లు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఉషశ్రీ వర్గానికి చెందిన తయుబ్ సుధాకర్ రెడ్డి సద్దాం శేషగిరి తదితరులు అభివృద్ధి పనులకు ఆమోదం తెలుపకుండా సమావేశం నుండి బయటికి వెళ్లారు. రెండు గ్రూపుల మధ్య జరిగే పరిణామాల వల్ల అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని అధికారులు ఇటు ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. వర్గాలకు ఆజ్యం పోస్తున్న మాజీ మంత్రులు అభివృద్ధిని అడ్డగించడం ఎంతవరకు న్యాయమని ప్రజలు విమర్శిస్తున్నారు.

రెండు గ్రూపులుగా వైసిపి కౌన్సిలర్లు

అజెండా తీర్మానాలు ఆమోదం పొందాయి: కమిషనర్ సతీష్ కుమార్

అజెండా అంశాలు చదివేటప్పుడు ఏ అంశం వద్ద కౌన్సిలర్లు బయటకు వెళ్తారన్న అంశం మాత్రమే ఆమోదం పొందదని మిగిలిన అంశాలన్నీ ఆమోదం పొందుతాయని కమిషనర్ సతీష్ కుమార్ వివరించారు. మున్సిపల్ చట్టంలో ఉన్న నిబంధనల మేరకే కౌన్సిల్లో ప్రవేశపెట్టిన అంశాలన్నీ ఆమోదం పొందాయన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీ కౌన్సిలర్లు: టిడిపి

నగర పంచాయతీ పరిధిలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతోందని ఓర్వలేని వైసీపీ కౌన్సిలర్లు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని అఫీషియల్ క్లబ్ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడారు.. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్ల వర్గ పోరు వల్ల పట్టణంలో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానికోనాపురం రోడ్డు పలు వార్డులలో డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల పై తీర్మానాలను వ్యతిరేకించడం చూస్తే వారు అభివృద్ధి నిరోధకులుగా నిలిచిపోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతి చెందిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక చేయూత అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వడంపై చర్చించకపోవడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, కౌన్సిలర్ గిరి, హనుమంతు యాదవ్, బాబుల్ రెడ్డి, త్రివేంద్ర నాయుడు, కృష్ణమూర్తి, రమణమ్మ, రఘువీరా చౌదరి, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, పీహెచ్సీలలో నెలకొన్న సమస్యలను తీర్చాలని డిమాండ్ చేస్తూ డి ఎం అండ్ హెచ్ ఓ ఫిరోజ్ బేగంకు ఆశాకార్యకర్తలు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పరిధిలో లేని పనులను చేయిస్తున్నారని, సొంత మొబైల్ ను వినియోగించి ప్రభుత్వ యాప్‌ల ద్వారా పనులు చేయాలని సూచిస్తున్నారని అన్నారు. లెప్రసీ, ఎన్సీడీ సిడి సర్వేలు చేయించరాదని, విలేజ్ హెల్త్ క్లినిక్లలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కూర్చోబెట్టరాదని, గుండుమల, పాముదుర్తి పీహెచ్సీలలో పెండింగ్లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల జిల్లా కోఆర్డినేటర్ త్రిలోక్‌నాథ్, జిల్లా అధ్యక్షులు త్రివేణి, కార్యదర్శి సౌభాగ్య, గౌరవ అధ్యక్షులు సాంబశివ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

కెజిబివి తనిఖీ

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను వైసిపి విద్యార్థి విభాగం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సక్రమంగా కల్పించాలని ఎస్‌ఒ రెహానాను కోరారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎఎన్‌ఎం పోస్టును, అటెండర్ పోస్టును భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రశాంత్, మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, సాయి, లోకనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ వితరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తికి చెందిన కిడ్నీ ఏకలవ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికలాంగుడికి వీల్ చైర్‌ను వితరణ చేశారు. పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్ చేతుల మీదుగా బుధవారం డీఎస్పీ కార్యాలయం ముందు బీడుపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణకు అందజేశారు. వెంకటనారాయణకు ఇటీవల అనారోగ్య కారణంతో కాలు తీసివేశారు. వీల్ చైర్ కొనలేని స్థితిలో ఉన్న ఆయన సంస్థ సభ్యులను ఆశ్రయించగా సంస్థ అధ్యక్షుడు షామీర్ స్పందించి ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయప్ప, మారుతి, గాజుల రామాంజనేయులు, రాము, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి నవోదయలో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - లేపాక్షి

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజులుగా జరిగిన బీజాపూర్ క్లస్టర్ కింద వచ్చే 18 నవోదయ విద్యాలయాల సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈసందర్భంగా నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ నాగరాజు మాట్లాడుతూ ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత లేపాక్షి నవోదయ విద్యాలయానికి లభించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్ కు రాష్ట్రంలోని చిత్తూరు, నెల్లూరు, కడప కర్నూలు జిల్లాల నవోదయ విద్యాలయాలనుండి విద్యార్థులు వచ్చినట్లు చెప్పారు. అదే విధంగా కర్ణాటక రాష్ట్రం నుండి బెంగుళూరు అర్బన్, బెంగుళూరు రూరల్, బళ్ళారి, బీదర్, గదగ్, కొప్పల్, కాలబుర్గి, దావనగిరి విజయ నగర-2 నవోదయ విద్యాలయాలనుండి ఒక్కొక్క నవోదయ విద్యాలయం నుంచి ఏడుగురు విద్యార్థులు వారు తయారు చేసిన నమూనాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారన్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కమిషనర్ నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్‌కి చెందిన సూర్య ప్రకాష్ రావు వచ్చినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలోని తిమ్మాగానిపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్‌సి కమిషన్ మెంబర్ రామాంజినేయులు మాట్లాడుతూ పౌరుల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అన్నారు. సమాజంలో అందరికి సమానమైన హక్కులుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహులు, ఆర్ఐ ప్రమీలమ్మ, గ్రామ రెవిన్యూ అధికారి నరసింహా మూర్తి ప్రజలు పాల్గొన్నారు.

పందుల తరలింపు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో పర్యాటకులకు, పాదచారులకు, వాహనదారులకు, సత్యసాయి భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్న పందులను అధికారులు ఇక్కడి నుంచి తరలించారు. బుధవారం మున్సిపాలిటీలోని కర్నాటకనాగేపల్లికి చెందిన పందులను ప్రత్యేకంగా పందులు పట్టే వారిని పిలిపించి దొరికిన పందులను పట్టుకుని వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్‌పెక్టర్ శివయ్య మాట్లాడుతూ పందులను పట్టణంలోకి రానివ్వకుండా చూడాలని పందుల యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే వారు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతో పట్టణంలో పందుల వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ముఖ్యంగా పలు కాలనీలలో సంచరిస్తూ విష జ్వరాలు కారణం అవుతున్నాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, కమిషనర్ క్రాంతి కుమార్ ఉత్తర్వులు ఇవ్వడంతో కొన్ని పందులను వాహనంలో తరలించడం జరిగిందన్నారు. మిగతా పందుల యజమానులు ఇకపై పట్టణంలోకి పందులు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఈ కార్యక్రమం నిలిపివేయడం జరిగిందన్నారు. ఇకపై పందులు పట్టణంలో సంచరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహాశక్తి సమాఖ్య వార్షికోత్సవం

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

మండలంలోని టింబక్టు కలెక్టివ్ కార్యాలయం వద్ద మహాశక్తి సమాఖ్య 13వ వార్షికోత్సవం మహిళలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహాశక్తి సమాఖ్య అధ్యక్షురాలు వెంకట లక్ష్మమ్మ, సీఈవో రమీజాబీ ఆధ్వర్యంలో ఈ మహోత్సవం నిర్వహించారు. సమాఖ్య కోఆర్డినేటర్ కలయికతో 9 మండలాలలో 33 గ్రామాలలో 34, 146 మంది సభ్యులతో నికర విలువ రూ. 65 కోట్లతో కలిగి ఉందన్నారు. 2024 - 25 సంవత్సరానికి సంబంధించి కార్యక్రమాల నివేదికను సభ్యుల ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన టింబక్ట్ కలెక్టివ్ వ్యవస్థాపకులు మేరీ మాట్లాడుతూ మహిళలు ఉమ్మడి బలాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టింబక్ట్ కలెక్టివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాటు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పిలకు ట్యాబులు పంపిణీ

పెనుకొండ: ప్రతి ఒక్కరు తమ నైపుణ్యాలను పెంచుకొని మరుకుగా పనిచేయాలని మెప్మా ఆర్‌పిలకు మంత్రి సవిత సూచించారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా విభాగంలో పనిచేస్తున్న 22 మంది ఆర్‌పిలకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెప్మా ఆర్‌పిలకు ఆన్‌లైన్ పని సులభతరం చేయడానికి ప్రభుత్వం ట్యాబులను పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

భూములిచ్చాం..ఉపాధి కల్పించండి...

ఆవేదన వ్యక్తం చేసిన కియా పరిశ్రమ భూ నిర్వాసితులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధిత రైతులు

ప్రజాశక్తి-పెనుకొండ

కియా పరిశ్రమ వస్తే తమ తలరాతలు మారుతాయి అని తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశపడ్డామని చివరకు వైఎస్‌ఆర్సిపి నాయకులు కోట్లరూపాయలు దోచుకుంటుంటే చూస్తూ ఊరుకున్నామని కియా పరిశ్రమ కు భూములు కోల్పోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని అఫీషియల్ క్లబ్బులో కియా పరిశ్రమ నిర్మాణ నేపథ్యంలో భూములు కోల్పోయిన రైతులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి పాలెంకు చెందిన రైతు కేశవయ్య మాట్లాడుతూ తనకున్న పది ఎకరాల భూమిని కియా పరిశ్రమ కోసం ప్రభుత్వం తీసుకుందన్నారు. భూములు తీసుకున్న సందర్భంలో పరిశ్రమలో భూములు ఇచ్చిన రైతుల కుటుంబంలోని అర్హులైన వారికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారన్నారు. పరిశ్రమ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్న భూములు కోల్పోయిన రైతు కుటుంబాల్లోని అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సెంటు భూమి పరిశ్రమకు ఇవ్వని రామ్మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి కియా అనుబంధ పరిశ్రమలలో కాంట్రాక్ట్ తీసుకుని వారి అనుచరులను ఉద్యోగాల్లో పెట్టుకున్నారన్నారు. భూములు కోల్పోయిన రైతుల నోట్లో మట్టి కొట్టి వైసిపి నాయకులు దోచుకు తింటున్నారని ఆయన విమర్శించారు. సాయి గీత సంస్థ పేరుతో రామ్మోహన్ రెడ్డి, అతని బావమరిది నరసింహారెడ్డి శంకు చక్ర పేరుతో సుధాకర్ రెడ్డి ఎస్కేఎస్ సంస్థ పేరుతో దుద్దేబండ సర్పంచి భర్త శ్రీకాంత్ రెడ్డి, కాసు సంస్థ పేరుతో కాకినాడకు చెందిన ఒక వ్యక్తి కియా అనుబంధ పరిశ్రమలలో కాంట్రాక్టు పొంది దోచుకు తింటున్నారని ఆయన ఆరోపించారు. భూములు ఇచ్చిన రైతులు ఉపాధి కల్పించంచాలని అన్ని సంస్థల చుట్టూ తిరిగిన స్పందించలేదన్నారు. భూములు కోల్పోయిన రైతు కుటుంబాల్లో ఎంబీఏ, బీటెక్ తదితర ఉన్నత చదువులు చదివిన పిల్లలు ఉన్నారని అలాంటి వారికి మరుగుదొడ్ల శుభ్రపరచడం వంటి పనులు ఇస్తే ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. ఈ విషయం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మంత్రి సవితకు ఈ విషయం చెప్పినా వారు స్పందించలేదన్నారు. తమకు ఉపాధి కల్పించాలని పరిశ్రమ వద్దకు వెళ్లి ఆందోళన చేశామన్నారు. రైతుల ఉపాధి కోసం వెళితే వైఎస్ఆర్సిపి మాజీ మంత్రులు, నాయకులు దాడులకు వెళ్లారని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు. కియా పరిశ్రమ వస్తే అందరూ అభివృద్ధి చెందుతారని అప్పటి ముఖ్య మంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు చెప్పితే ఆయన మాటలను నమ్మి భూములను ఇచ్చామని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాంతానికి వచ్చి తాము అధికారంలోకి వస్తే రైతులకు భూములు తిరిగి వెనక్కు ఇప్పిస్తామని అన్నారని చెప్పారు. అయితే అధికారం వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు నాయకులు అదేకియా పరిశ్రమలో దోచుకు తింటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు రైతుల కోసం సహకరించాలని వారు కోరారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరగకపోతే తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ సమావేశంలో కియా పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతులు రామాంజనేయ, రామాంజనేయులు, పెద్దన్న, సోము, చిన్న పోతన్న, లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటగిరి పాలెం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

సత్యసాయి జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని పుట్టపర్తి అభివృద్ధికి కౌన్సిలర్లు అధికారులు సమిష్టిగా కృషి చేద్దామని మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి పిలుపునిచ్చారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ త్వరలో జరిగే సత్యసాయి శతజయంతి ఉత్సవాల నిర్వహణకు సభ్యులు నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి మాట్లాడుతూ 20వ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదని, చింత తోపు వద్ద ఐమాక్స్ దీపాలు ఏర్పాటు చేయాలని, శ్మశాన వాటిక నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మందిరం పడమట రహదారి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కౌన్సిలర్ సూర్య గౌడ్ మాట్లాడుతూ పడమట రహదారికి టెండర్ పిలవాల్సి ఉంటుందన్నారు. ఆ పనిని ఆర్ అండ్ బి అధికారులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపడిందని పందులను అరికట్టడానికి చర్యలు తీసుకున్న శానిటరీ ఇన్స్‌పెక్టర్ శివయ్యను అభినందించారు. వైస్ ఛైర్మన్ తిప్పన్న మాట్లాడుతూ తమ వార్డులో మురుగునీరు నిలువలు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని కోరారు. చెరువు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలో ఉన్న కాలువలలో మురుగునీరు నిలవలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యసాయి పూర్వపు విద్యార్థులు పడమటి గేటు సమీపంలో నిర్మిస్తున్న క్యాన్సర్ ఆసుపత్రికి అవసరమైన నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ సభ్యులు వెల్లడించిన సమస్యలపై ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహులు, ఏఈ స్వాతితో పాటు కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

'సుపరిపాలనలో తొలి అడుగు' ఇదేనా..?

మండలంలో తీరని నీటి కష్టాలు

పొలాల బాట పడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని తుమ్మలకుంట, లాలేపల్లి, భూమయ్యగారిపల్లి గ్రామాలు తీవ్రమైన తాగునీటి సమస్య తో అల్లాడుతున్నాయి. తాగడానికి బిందె నిండా నీరు తీసుకోవాలంటే కిలోమీటర్ల దూరం నడిచి పొలాలకే వెళ్లాల్సిన పరిస్థితి. ఇది వారి నిత్య జీవనశైలి అయిపోయింది. ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ అధికారులు నీటి సమస్యలు ఉండకుండా చూస్తామంటున్నప్పటి పలు గ్రామాల్లో మాత్రం స్థితిగతులు మారడం లేదు. ప్రజలు చెప్పే విన్నపాలు విన్నట్టు చేసి, కార్యాచరణ మాత్రం లేకపోవడంతో గ్రామస్తుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నీటి కోసం పాట్లు పడుతున్నాం, కానీ పరిష్కారం కనిపించదు. మాటలకే పరిమితమైన పాలకుల నిబంధనలు మాకెందుకు? అని వారు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం, స్థానిక పాలకులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిరసనలు చేసినా అధికారులు పట్టించుకోలేదని ప్రజాసంఘాలు వాపోతున్నాయి. ఇక టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' అంటూ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. అయితే, గ్రామాలలో నెలకొన్న అసలు సమస్యలపైన స్పందన లేకపోవడం ప్రజల్లో విసుగు, ఆగ్రహానికి దారితీస్తోంది. "అభివద్ధి మాటలు ఎక్కువే... కానీ చర్యలు గాలిలో కలిసిపోతున్నాయి" అన్నది ప్రజాభిప్రాయం.

పొలాలనుంచి నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గోరంట్ల

మండల కేంద్రంలోని వెంకటసాయి ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ శివన్న నాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడుతూ మండల కేంద్రంలో ఐటిఐ చదువుతున్న విద్యార్థులు అందరూ పేద రైతాంగానికి సంబంధించిన విద్యార్థులని అన్నారు. అయితే ప్రభుత్వం నుండి ప్రతి విద్యార్థికి వచ్చిన స్కాలర్‌షిప్‌ను విద్యార్థులకు ఇవ్వకుండా ప్రిన్సిపల్ అక్రమానికి పాల్పడ్డాడరని విమర్శించారు. స్కాలర్‌షిప్ గత ఫిబ్రవరి నెలలో కళాశాల యాజమాన్యం ఖాతాలోకి ప్రభుత్వం జమ చేసిందన్నారు. అయితే ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యం విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విద్యార్థుల డబ్బులు స్వాహా చేశారన్నారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రావలసిన విద్యార్థికిట్లు ఇవ్వకుండా దాదాపు 100 మంది విద్యార్థులకు సంబంధించి కిట్లన్నీ కూడా కళాశాల యాజమాన్యం కాజేసిందన్నారు. తక్షణం కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

విద్యుత్ సమస్య లేని పట్టణంగా తీర్చిదిద్దుదాం

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర నగర పంచాయతీని విద్యుత్ సమస్య లేని పట్టణంగా తీర్చిదిద్దాలని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ భవనంలో మున్సిపల్ సర్వసాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ ఛైర్మన్ నరసింహ రాజు అధ్యక్షతన నిర్వహించారు. వార్డుల్లో చేపట్టాల్సిన సిసి రోడ్లు, డ్రయినేజీల నిర్మాణం, త్రాగునీటి సమస్య, విద్యుత్ దీపాలు ఏర్పాటుపై కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అక్రమ లేఅవుట్లు ఉన్నా వాటిని వెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. మధ్య తరగతి కుటుంబాల వారు నిరుపేదలు ఇల్లు నిర్మించుకుంటుంటే పన్నుల పేరిట వేధించవద్దని ఆదేశించారు. ప్రతి శుక్ర, శనివారం అధికారులు, కౌన్సిలర్లు వార్డుల్లో తిరిగి సమస్యలు పరిష్కరించాలన్నారు. వచ్చే సమావేశానికి అధికారులందరూ తప్పక హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథం, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

అమాయక ప్రజలకు అనేక ఆశలు చూపి మభ్యపెట్టి ఆ తర్వాత మోసం చేస్తుంటారని అలాంటి వారిని నమ్మకూడదని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా బుధవారం కదిరి బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో మానవులను అక్రమ రవాణా చేసి వ్యాపారం చేసే శక్తులు పొంచి ఉన్నాయని వారి పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కేసులను పరిశీలిస్తున్న సందర్భంలో మైనర్లు, మోసపోయిన మహిళల ఘటనలు చూస్తుంటామన్నారు. మానవ అక్రమ రవాణా వ్యాపారం అనేది ఆటవికమని అన్నారు. విద్యార్థి దశ నుంచే ఇలాంటి అమానవీయ ఘటనలను తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉందని చెప్పారు. విద్యార్థులు గుడ్ టచ్ బాడ్ టచ్ అనే అంశాల పట్ల కూడా జాగ్రత్తగా మసలుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ పి లోకనాథం, గర్ల్స్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వెంకటేష్ ప్రసాద్, లెక్చరర్ ప్రశాంత్, న్యాయవాదులు లోకేశ్వర్ రెడ్డి, నరసింహులు జన జాగృతి ప్రతినిధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పి-4తో పేదరికం లేని సమాజం : మంత్రి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పేదరికం లేని సమాజాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం పి 4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ భాగస్వామ్యం) కార్యక్రమాన్ని చేపట్టిందనిమంత్రి సవిత తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాల యంలో భువన విజయం సమావేశం మందిరంలో పి4 నీడ్ అసెస్మెంట్ సర్వే పై సమావేశం నిర్వహించారు. పెనుకొండ మున్సిపాలిటీ రూరల్ పరిధిలోని పలువురు నాయకులు వ్యాపారస్తులు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. అదేవిధంగా ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ తరపున ఒక్కొక్క పాఠశాల యాజమాన్యం 10 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రగతి శ్రీనివాసులు సిద్ధార్థ స్కూల్ యాజమాన్యం లింగారెడ్డి మంత్రికి వివరించారు. పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ కృష్ణమూర్తి 10 కుటుంబాలు, టింబర్ డిపో యజమాని షౌకత్ ఐదు కుటుంబాలు, ఐరన్ మార్ట్ యజమాని త్రివేంద్ర నాయుడు ఐదు కుటుంబాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీరాములు యాదవ్ ఐదు కుటుంబాలు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కొంతమంది పేదలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నప్పటికీ కొన్ని ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో పేదరిక నిర్మూలన ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఆర్థికంగా స్థిరపడిన ప్రతి ఒక్కరూ, విదేశాలలో ఉండే ఎన్నారైలు పి4కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, డీఎస్పీ నర్సింగప్ప, ఎంపీడీవో నరేష్‌కృష్ణ, తహశీల్దార్ స్వాతి, నాయకులు కేశవయ్య, నారాయణస్వామి, శ్రీనివాసులు, సింగిల్ విండో అధ్యక్షులు పోతిరెడ్డి, పలువురు వ్యాపారస్తులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో నలుగురికి జరిమానా

ప్రజాశక్తి -రొద్దం

వ్యక్తి పై దాడి కేసులో పెనుగొండ కోర్టు జడ్జి బొజ్జప్ప నిందితులకు జరిమానా విధించినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. 2022లో మండలంలోని ఎల్. తిమ్మాపురం గ్రామానికి చెందిన కురుబ ఆదిలక్ష్మమ్మపై అదే గ్రామానికి చెందిన కురుబ జయరామప్ప, వెంకమ్మ, శంకరప్ప, ఉమక్క కలిసి దాడిచేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కోర్టు విచారణ అనంతరం జడ్జి నిందితులకు ఒక్కొక్కరికి 2వేల రూపాయల జరిమానా విధించినట్లు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ పెనుకొండ ప్రిన్సిపుల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏం.బొజ్జప్ప బుధవారం తీర్పు వెలువరించారన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామనిఎస్పీ వి రత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రాం తదితర సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా సత్యదూరమైన పోస్టులు పెట్టడం ప్రజల దృష్టి మర్చలడమేనని పేర్కొన్నారు. కదిరి మండలంలోని కాల సముద్రం గ్రామంలో గంజాయి మత్తులో యువకులు గొడవ పడినట్లు మీడియాలో ప్రచారం చేయడంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ముందువెనుక ఆలోచించకుండా సోషల్ మీడియా గ్రూపులో పోస్టులు పెట్టారన్నారు. పోలీసుల విచారణలో మద్యం మత్తులోనే గొడవ పడినట్లు తేలిందన్నారు. ఇలాంటి విషయాలలో ప్రచారం చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, అసత్య ప్రచారాలు చేస్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా పెనుగొండ సమీపంలో కియా పరిశ్రమ వద్ద పెద్ద గొడవ జరిగినట్లు ప్రచారం జరిగిందని అందులో వాస్తవం లేదని, వ్యక్తిగత కారణాలతో చిన్నపాటి గొడవ జరిగిందని అన్నారు. పోలీసులు కలగజేసుకొని సర్దిచెప్పి పంపారన్నారు.

ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఓబుళ దేవరచెరువు

తలుపుల మండలంలోని రాజనాలపల్లికి చెందిన నవీన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వడియ రాజుల మండల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవావారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వడియ రాజుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఇడగొట్ట ఆంజనేయులు, ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ దండగల చెన్నకేశవులు, గౌరవ అధ్యక్షుడు ఇడగొట్ట వీరాంజనేయులు, గౌరవ సలహాదారుడు కుంచెపు శ్రీనివాసులు, నాగరాజు, గంగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి - రొద్దం

బాల్యవివాహాల నిరోధక కమిటీ సభ్యులకు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి మురళి నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపీడీవో రామ్ కుమార్ అధ్యక్షతన సూపర్వైజర్ అనురాధ సహకారంతో మండల, గ్రామస్థాయి, బాల్యవివాహాల నిరోధక కమిటీ, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులకు, 15 సచివాలయాల కమిటీలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ గోవిందప్ప, తురకలాపట్నం ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయులు, వెంగప్ప, సూపర్వైజర్ అనురాధ, బాలవివాహాల నిర్మూలన కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - పరిగి

మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గిరీష్ కుమార్, కార్యదర్శిగా హరిప్రసాద్ ఎన్నికయ్యారు. అదే విధంగా గౌరవాధ్యక్షులుగా రమేష్, ఉపాధ్యక్షులుగా సీనియర్ పాత్రికేయులు ఈ. మూర్తి, సంయుక్త కార్యదర్శి గా శ్రీనివాసులు, ట్రెజరర్ గా శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గిరీష్ బాబు, వెంకటేష్, ప్రశాంత్, రామకష్ణ, నవీన్, మున్నా, చాంద్ భాష, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి హరి ప్రసాద్ మాట్లాడుతూ పరిగి మండలంలోనివిలేకరుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. మండలంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు, అధికార ప్రతిపక్షాల దాడులు, మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నిర్మాణ పనులతో పాటు పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

హరిప్రసాద్

మొక్కుబడిగా మండల మీట్

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రత్నమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశానికి ఎంపీటీసీ లతోపాటు మండల వ్యాప్తంగా ఉన్న 14 గ్రామ పంచాయితీ సర్పంచులు పాల్గొనాల్సి ఉంది. అయితే పూర్తిస్థాయిలో సభ్యులు పాల్గొనలేదు. పాల్గొన్న అరకొర సభ్యులు సైతం ప్రజా సమస్యలపై నోరు మెదపలేదు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పథకాలను వివరించారు. ప్రజా సమస్యలపై ఎటువంటి చర్యలు జరపకుండా అందరూ కలిసి సమావేశాన్ని మమ అనిపించారు. ఈ సమావేశంలో మండల వైస్ చైర్మన్ లు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా మీ సమస్య- మా బాధ్యత కార్యక్రమం చేపట్టామని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బుధవారం బత్తలపల్లిలోని సచివాలయం 1లో మీ సమస్య- మా బాధ్యత కార్యక్రమానికి పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు. నూతన ఫించన్లు, రేషన్‌కార్డులు, హౌసింగ్, స్థలాలు, విద్యుత్ సమస్యలు, తల్లికి వందనం, భూ సమస్యలు, తదితర సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ధర్మవరం మార్కెట్యార్డు వైస్చైర్మెన్ అయ్యప్ప, అమర్నాథ్‌చౌదరి, చల్లా శ్రీనివాసులు, సుబ్బరాయుడు, రాము, రమణ, కేశవులు, అప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలతో రైతుల అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బుక్కపట్నం

రైతుల అభివృద్ధే ధ్యేయంగా సహకార సంఘ సొసైటీలు పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో కృష్ణాపురం సహకార సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన అప్ప స్వామి ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందించి రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి పరచాలని సహకార సంఘం కమిటీ సంఘ సభ్యులకు సూచించారు. అనంతరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఇటీవల గసిగ వారి పల్లి గ్రామానికి చెందిన రైతు ప్రమాదవశాస్తూ మృతి చెందడంతో బీమా కంపెనీ నుంచి విడుదలైన రెండు లక్షల రూపాయల చెక్కును రైతు కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా అందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మలిరెడ్డి, సత్యసాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు గంగాధర్, కృష్ణమూర్తి, ప్రభాకర్ రెడ్డి, నరేష్, మాజీ సర్పంచి నారాయణస్వామి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి